పశు బీమా హుళక్కే!

- పాడి రైతులకు తప్పని కష్టాలు
- ప్రమాదవశాత్తూ పశువులు మరణిస్తే పైసా అందని వైనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో పాడి రైతులు

మండలంలోని లంకెలకూరపాడు గ్రామానికి చెందిన నడికట్టు మస్తానమ్మ అనే మహిళా రైతు గత నెల 17న గేదెలు మేపుకొనేందుకు గ్రామంలోని దక్షిణం వైపు పొలాలకు వెళ్లింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతంతో పాటుగా పిడుగులతో కూడిన వర్షం పడుతుండటంతో ఇంటికి బయలుదేరింది. మార్గమధ్యలోనే పిడుగుపాటుకు గురై సుమారు రూ.లక్ష విలువ చేసే గేదె, దూడ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. ప్రకృతి వైపరీత్యంతో పశువులు మృతి చెందినప్పటికీ ఎటువంటి సాయం అందలేదు. పశుబీమా లేకపోవడంతో సాయం అందకుండా పోయింది. పిడుగుపాటుకు గురై మస్తానమ్మ కంటిచూపు సైతం మందగించింది.



ముప్పాళ్ళ: కూటమి ప్రభుత్వం పాడి రైతులకు అండగా నిలిచే పశుబీమాకు మంగళం పాడింది. పాడినే నమ్ముకొని జీవించే వారంతా కూటమి ప్రభుత్వం ఉదాసీన వైఖరితో పీకల లోతు కష్టాల్లో పడాల్సి వస్తుంది. వర్షాకాలం కావటంతో అనుకోని విపత్తులతో పశువులు మృత్యువాత పడుతుంటాయి. ఆ సమయంలో పశుబీమా కొంత ఊరట నిస్తుంది. అలాంటి పశుబీమాపై కూటమి ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవటంతో ఏదైనా ప్రమాదం జరిగితే తీవ్రంగా నష్టపోతామని పశుపోషకులు వాపోతున్నారు.

వ్యాధుల కాలం...

ప్రస్తుత వానాకాలంలో గేదెలకు హెచ్ఎస్‌బీక్యూ, గాలికుంటు, థైలేరియా తదితర వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రాణాంత వ్యాధులు సోకడం వల్ల పశువులు తరచుగా మృత్యువాత పడుతుంటాయి. వీటికి తోడు వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, విద్యుత్ ఘాతాలు సంభవించినప్పుడు కూడా పశువులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నాయి. రూ.లక్షలు అప్పుగా తెచ్చుకొని కొనుగోలు చేసిన పశువులు అర్ధాంతరంగా మృతి చెందితే ఆ రైతు పడే బాధ వర్ణనాతీతం. ఈ నేపథ్యంలోనే బీమా పథకాల ద్వారా సహాయం పొందితే పాడి రైతులకు కొంత ఉపశమనం కలిగించేవి.



ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

ప్రస్తుతం ఆవు, గేదెలు ఇతరత్రా పెంపుడు జీవాలకు సంబంధించి బీమా ప్రీమియం కట్టించుకునేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. బీమా సౌకర్యంపై చాలా మంది రైతులు అడుగుతున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే బీమా సౌకర్యం కల్పిస్తాం.

–డి.బాలకృష్ణారెడ్డి, మండల పశువైద్యాధికారి, ముప్పాళ్ళ

బీమా సౌకర్యం కల్పించాలి



ప్రభుత్వం పశువులకు బీమా సౌకర్యం కల్పించాలి. గతంలో ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేంది. ప్రమాదవశాత్తూ జీవాలు మృత్యువాత పడితే పూర్తిగా నష్టపోతాం. రెండు పాడి ఆవులు కొనాలంటే ఇప్పుడు రూ.లక్షన్నర ఖర్చవుతుంది. పశుపోషణ కూడా భారంగా మారింది. ఇలాంటి సమయంలో బీమా సౌకర్యం లేకపోతే తీవ్రంగా నష్టపోవాల్సివస్తుంది. పశుపోషణ వదిలేయాల్సిన పరిస్థితి దాపురించింది.

–కారుమూరి కృష్ణారెడ్డి, రైతు, బొల్లవరం

మండలంలో పశువుల వివరాలు

ఆవులు	1,100
గేదెలు	10,234
గొర్రెలు	8,052
మేకలు	500

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పశు బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు జరిగింది. ఆవు మృతి చెందితే రూ.15వేలు, పాడి ఆవు చనిపోతే రూ.30వేలు పరిహారం అందించి ఆదుకుంది. ప్రభుత్వం తరఫున పశువైద్యాధికారులు ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాల్సి ఉండేది. అందులో రైతు వాటా కింద 3.5శాతం, ప్రభుత్వం 3.5శాతం బీమా ప్రీమియం భరించేది. దీని వలన రైతుకు కొంతవరకు ఉపయోగంగా ఉండేది. అలాగే క్షీరసాగర పథకం ద్వారా 6,7 నెలల గర్భంతో ఉన్న గేదె, ఆవుకు బీమా సౌకర్యం ఉండేది. ప్రస్తుతం బీమా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా పశుబీమాపై ఎలాంటి స్పష్టత లేదు.

భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు


సత్తెనపల్లి గాంధీచౌక్‌లో పూజలందుకున్న వినాయకుడు


కొమెరపూడిలో వినాయకుడి పూజల్లో డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి


వెంకటాయపాలెంలో లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తున్న ఉత్సవ కమిటీ, యువకులు


సత్తెనపల్లిలో వినాయక నిమజ్జన ఊరేగింపులో ఎస్ఎస్‌పీ ఈఈ మురళీధర్, ఉద్యోగులు

గణపతి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాల్గో రోజు శనివారం పలు గ్రామాల్లోని మండపాల్లో కొలువైన వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు నేతలు సందర్శించి పూజలు నిర్వహించారు. పలు చోట్ల లడ్డూ ప్రసాదాల వేలం నిర్వహించారు. అదేవిధంగా అంగరంగ వైభవంగా గణనాథులను నిమజ్జనానికి తరలించారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ లైట్ల కాంతులు, బాణసంచా వెలుగుల నడుమ గణనాథులను గంగమ్మ చెంతకు తరలించారు.

– సత్తెనపల్లి/బెల్లంకొండ/ముప్పాళ్ళ/క్రోసూరు


చాగంటివారిపాలెంలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


క్రోసూరులో నిమజ్జనానికి తరలుతున్న బాల వినాయకుడు

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం


సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి


సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు

సత్తెనపల్లి: కౌన్సిల్ అంటే అధికారులకు లెక్క లేదా అని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్ కుమార్ ప్రశ్నించారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన శనివారం జరిగాయి. ఈసమావేశాల్లో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించి, మూడు నెలలు అయినా, ఇంతవరకు సమావేశం ఏర్పాటు చేయలేదని, ప్రతి సమావేశంలో తాను ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నానన్నారు. కౌన్సిల్ అంటే అధికారులకు లెక్కలేదని అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేస్తామని, ఎమ్మెల్యే ఎప్పుడు అందుబాటులో ఉంటారో చూసి త్వరితగతిన ఏర్పాటు చేస్తామన్నారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సుమన్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని 7వ వార్డులో ఆక్రమణలు యథేచ్ఛగా జరుగు తున్నాయని టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణలు తొలగిస్తున్నా, 24 గంటల్లో మళ్లీ ఆక్రమిస్తున్నారన్నారు. టీపీఓ పీ.రాధాకృష్ణ మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన ఆక్రమణలు వెంటనే తొలగింపు చేస్తామన్నారు. ఫ్లోర్ లీడర్ తురకమేరీ గ్రేస్ మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్ బాగాలేదని, వర్షాలు వల్ల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయన్నారు. కుక్కలు, కోతులు బెడద భయంకరంగా ఉందని, కుక్కలకు వెంటనే వ్యాక్సిన్లు వేయాలన్నారు. తొలుత సాధారణ, అత్యవసర సమావేశ అజెండాల్లోని అన్ని అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.లావణ్య


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి ఎస్.లావణ్య, చిత్రంలో ఎస్ఐ చల్లా సురేష్

నకరికల్లు: చట్టాలపై ప్రతిఒక్కరూ ప్రాథమిక అవగాహన పెంపొందించుకోవాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.లావణ్య సూచించారు. మండల న్యాయ సేవా కమిటీ నరసరావుపేట ఆధ్వర్యంలో మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సామాన్యులకు సైతం చట్టాల ద్వారా సరైన న్యాయం అందుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిబంధనలు పాటిస్తే న్యాయం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు నేరమన్నారు. బాల్య వివాహాలు చేసిన వారు, ప్రోత్సహించిన వారు చట్టం దృష్టిలో నేరం చేసినవారవుతారన్నారు. సివిల్ కేసులు, ఆస్తి తగాదాలు, రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించిన విధివిధానాలు వివరించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి రామినేని ప్రసాద్, తహసీల్దార్ కె.పుల్లారావు, ఎస్ఐ చల్లా సురేష్, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శివరామ శేషయ్యకు క్రీడారత్న అవార్డు


అవార్డు అందుకున్న కుర్రం శివరామశేషయ్యతో పరంధామయ్య, పీడీలు, నాయకులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు కుర్రం శివరామ శేషయ్యకు మాస్టర్ అథ్లెటిక్స్‌లో సాధించిన విజయాలను, చేసిన సేవలను గుర్తిస్తూ ఆశ్రయ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో క్రీడారత్న అవార్డును ప్రదానం చేశారు. పట్టణంలోని వావిలాల గోపాలకృష్ణయ్య స్మృతి వనంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం శివరామశేషయ్యకు ఈ అవార్డును అందించి, పూలమాలలుతో సత్కరించారు. ఈ సందర్భంగా శివరామ శేషయ్య క్రీడా రంగానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఆశ్రయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దీపాల పరంధామయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.అచ్చిరెడ్డి, ఐఎస్ నాగిరెడ్డి, దాసరి కోటేశ్వరరావు, నాయకులు ఆకుల హనుమంత రావు, నిమ్మగడ్డ హనుమంతరావు, జెమిలీ రాధాకృష్ణ, బి.నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మద్యం మత్తులో యువకుల వీరంగం



బెల్లంకొండ: మద్యం సేవించి బస్సు ఎక్కిన యువకులు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. బస్సులో ఉన్న మహిళా ప్రయాణికులు డయల్ 100కు కాల్‌చేసి ఫిర్యాదు చేయడంతో వారిని బెల్లంకొండ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ డి.ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంకొండ గ్రామానికి చెందిన పఠాన్ బాషా, బెల్లంకొండ షేక్ జానీలు మద్యం సేవించి కొండమోడు వద్ద క్రోసూరు వెళ్లే బస్సు ఎక్కారు. బెల్లంకొండకి వెళ్లేందుకు టికెట్ తీసుకుని బస్సులో వెనక కూర్చున్నారు. కాగా బెల్లంకొండ స్టాప్ రాకముందే బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద బెల్లంకొండ దాటి పోతున్నా బస్సు ఆపవేంటి అంటూ డ్రైవర్ పై దుర్భాషలాడుతూ దూసుకెళ్లారు. మహిళా ప్రయాణికులు వారిస్తున్నప్పటికీ వారిని కూడా తిడుతూ, బస్సు దిగి నానా హంగామా సృష్టించారు. బస్సును తంతూ, బస్సు ముందు రోడ్డుపై పడుకుని బస్సును వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న బెల్లంకొండ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు వారికి మద్య పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించినట్లు నమోదయిందని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. కాగా మద్యం షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేసి, విక్రయిస్తున్నారని, దీంతో యువకులు, తాగుబోతులు మద్యం సేవించి నిత్యం వీరంగాలు చేస్తున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

విద్యాసామర్థ్యాలను పెంచాలి

ఆదర్శ పాఠశాలల స్టేట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి సుజన



నకరికల్లు: విద్యార్థుల సామర్థ్యాలను పెంచే విధంగా ప్రణాళికలు అమలు చేయాలని ఆదర్శ పాఠశాలల స్టేట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి సుజన సూచించారు. మండలంలోని దేచవరం గ్రామంలోని ఆదర్శపాఠశాలలో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. పాఠశాల పరిశుభ్రత, క్రమశిక్షణ, అకడమిక్ రికార్డులు, విద్యార్థుల నైపుణ్యాలు, నోట్‌పుస్తకాల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు సేకరించామన్నారు. ఉపాధ్యాయులతో చర్చించి మెరుగైన అంశాల అమలుకు పలు సూచనలు చేశామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ వేళాంగిణి మేరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు బోధకులకు సత్కారం



సత్తెనపల్లి: దేశభాషలందు తెలుగు లెస్స అని రిటైర్డ్ తెలుగు పండితుడు మంచికంటి వెంకటేశ్వరరావు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని యజ్ఞశ్రీ ట్యుటోరియల్స్ నందు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రిటైర్డ్ తెలుగు పండితుడు మంచికంటి వెంకటేశ్వరరావు, పెదమక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు పూదోట లూర్దుమేరీ, ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకు రాలు గుడిపూడి కుమారిలను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్లబ్ సభ్యుడైన పొత్తూరు రామకోటయ్యను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బండ్లమూడి వీరాంజనేయులు, సెక్రటరీ ముద్దా రమేష్ బాబు, ట్రెజరర్ బత్తుల రోశయ్య, ఆర్‌సీ తోట చిన్న సాంబయ్య, జిల్లా క్యాబినెట్ సభ్యులు పొన్నెకంటి కిషోర్ బాబు, రామకోటయ్య, క్లబ్ సీనియర్ సభ్యులు పెద్దింటి వెంకటేశ్వర్లు, కోట వెంకటేశ్వర్లు, తవిటి భావనారాయణ, కృష్ణమాచార్యులు, కొండవీటి రాజు, న్యాయవాది సైదయ్య, తదితరులు ఉన్నారు.

జనవిజ్ఞాన వేదిక సమావేశం విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ శనివారం కోరారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 31న ఉదయం 9 గంటలకు నరసరావుపేటలోని కేశానుపల్లి రోడ్డులో గల ఎంఏఎం కళాశాలలో విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ జరుగుతుందన్నారు. ప్రధాన వక్తగా డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, వక్తగా డాక్టర్ ప్రత్యూష హాజరవుతారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్లాస్ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా కమిటీ సమావేశం జరుగుతుందన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్



చిలకలూరిపేటటౌన్: నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచిన ఒక ఆటో డ్రైవర్‌ను చిలకలూరిపేట పోలీసులు అభినందించారు. ఆదర్శంగా నిలిచిన సదరు డ్రైవర్‌కు పోలీసులు నగదు బహుమతి కూడా అందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిలకలూరిపేట ఆటో యూనియన్‌కు చెందిన ఆటో డ్రైవర్ డి. దానయ్య తన ఆటోలో ప్రయాణించిన ఓ మహిళ పర్సును మర్చిపోయినట్లు గుర్తించాడు. దానిని తీసుకుని నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పగించాడు.
అందులో రూ.6,500 నగదు, ఏటీఎం కార్డులు ఉన్నాయి. ఆటోలో ప్రయాణించి పర్సుపోగొట్టుకున్న మహిళను పిలిపించి ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాజు, ఇతర సభ్యులు ఆ పర్సును మహిళకు పోలీసులు సమక్షంలో అందజేశారు. ఆటో డ్రైవర్ నిజాయితీని మెచ్చుకుంటూ అర్బన్ సీఐ పి.రమేష్ రూ.వెయ్యి దానయ్యకు అందించి ప్రోత్సహించారు. ఆటో డ్రైవర్లు దానయ్య చూపిన నిజాయితీని ఆదర్శంగా కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ హజరత్తయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.